క్లుప్తంగా

బంగారు లాకెట్ బహూకరణ



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షి తాయి అమ్మవారికి దాతలు ఆదివారం బంగారు లాకెట్‌ను బహూకరించారు. కావలికి చెందిన సూరిబోయిన శ్రీధర్‌రెడ్డి, మమత దంపతులు అమ్మవారికి 9 గ్రాముల బంగారు లాకెట్‌ను అందజేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలను శేషవస్త్రాలతో సత్కరించారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



పొదలకూరు : మండలంలోని మహ్మదాపురం, పొదలకూరు సాంఘీక సంక్షేమ వసతిగృహాల్లోని పదోతరగతి విద్యార్థులకు ఆదివారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. పొదలకూరులోని ఎస్వీబీవీడీ కళాశాల సౌజన్యంతో పొదలకూరు ఏఎస్‌డబ్ల్యూఓ డీ నరసింహారెడ్డి చేతుల మీదుగా ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్‌డబ్ల్యూఓ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమాధికారిణి విద్యుల్లత, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



బైక్‌పై వెళ్తున్న స్వల్పంగా గాయపడిన వ్యక్తి



క్షతగాత్రుడ్ని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

ముత్తుకూరు: ముత్తుకూరు–నెల్లూరు ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు..నెల్లూరు నుంచి ముత్తుకూరు వైపు ఇద్దరు వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై బయలుదేరారు. మరో వ్యక్తి ముత్తుకూరు నుంచి నెల్లూరు వైపు మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. లింగాయపాళెం కూడలి సమీపంలో ఎదురెదురుగా రెండు మోటార్‌సైకిళ్లు అదుపుతప్పి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. వీరిలో గోపాలపురానికి చెందిన ఏడుకొండలు తీవ్రంగా గాయపడగా 108 వైద్యసిబ్బంది వెంటనే చింతారెడ్డిపాళెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన మిగిలిన ఇద్దరు వ్యక్తులు బైక్‌లపై వెళ్లిపోయారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. 1964 నుంచి 2005 మధ్య చదువుకున్న వారు హాజరయ్యారు. నాటి స్మృతులను నెమరేసుకొని ఉత్సాహంగా గడిపారు. అనంతరం ప్రభుత్వ పాలిటెక్నిక్ అలుమ్ని అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షుడిగా ప్రిన్సిపల్ సుధాకర్, గౌరవ సెక్రటరీగా సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడిగా శ్రీనాథ్, కార్యదర్శిగా ప్రభాకర్, మరో 16 మందిని ఎన్నుకున్నారు. కళాశాల అభివృద్ధికి రూ.ఐదు లక్షలను అందిస్తున్నామని శ్రీనాథ్, ప్రభాకర్ పేర్కొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



నెల్లూరు(బృందావనం): శోభకృత్ నామ ఉగాది కవి సమ్మేళనాన్ని మద్రాస్ బస్టాండ్ సమీపంలోని నెల్లూరు హాస్పిటల్ సమావేశ మందిరంలో పెన్నా రచయితల సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కవులు, రచయితలు చెంచులక్ష్మమ్మ, గురుమూర్తి స్మారక ఉగాది పురస్కారాలను సునీల్, రాము, నాగగాయత్రికి అందజేశారు. సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్‌బాబు, సులోచన, రామచంద్రప్రసాద్, శివకుమార్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ హాస్టళ్లు వరం

- డ్రాపౌట్స్ నివారణే లక్ష్యంగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఏర్పాటు
- సమగ్ర శిక్ష అభియాన్ ఆర్థిక తోడ్పాటు
- కోవూరు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో నిర్వహణ



సీజనల్ హాస్టల్‌లోని పిల్లలకు బోధన

కొడవలూరు: గ్రామాల్లో డ్రాపౌట్స్ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేసింది. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీలు ఎక్కువగా ఉన్న వెనుకబడిన ప్రాంతాల్లో ఎన్జీఓ సహకారంతో సమగ్ర శిక్ష అభియాన్ ఆర్థిక తోడ్పాటుతో వీటిని నిర్వహిస్తోంది. ఈ సీజనల్ హాస్టళ్లు డ్రాపౌట్, వలస విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతున్నాయి. ఒక్కో హాస్టల్‌లో 50 మంది విద్యార్థులకుపైగా ఉంటూ వాటిని సద్వినియోగం చేసుకుంటుండడం గమనార్హం.

హాస్టళ్ల నిర్వహణ ఇలా..

సీజనల్ హాస్టళ్లను ప్రధానంగా ఎస్సీ, ఎస్టీలు ఉన్న బాగా వెనుకబడిన ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ బాధ్యతను ఎన్జీఓ సంస్థలు తీసుకున్నాయి. పాఠశాలలకు అనుబంధంగా నిర్వహించే వీటిలో పిల్లలకు ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం అందిస్తారు. మధ్యాహ్న భోజనం పాఠశాలలో అందిస్తారు. ఉదయం, సాయంత్ర వేళల్లో ప్రత్యేక బోధకులతో బోధన చేయిస్తారు. పాఠశాలల సమయం ఆధారంగా వసతిగృహం నడుస్తుంది. కోవూరు నియోజకవర్గంలోని కొడవలూరు, కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం మండలాల్లో ఈ హాస్టళ్లు ఉన్నాయి. వీటి నిర్వహణకు అయ్యే ఖర్చును ముందుగా ఎన్జీఓ సంస్థ భరిస్తుంది. ఆ తరువాత సమగ్ర శిక్ష అభియాన్ నుంచి పొందాల్సి ఉంటుంది.

డ్రాపౌట్స్, వలసలతో పాటు నిరుపేదలకు ఉపయుక్తం

కొడవలూరులోని ఎన్టీఆర్ గిరిజన కాలనీలో సీజనల్ హాస్టల్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతానికి వ్యవసాయం, ఇతర పనుల నిమిత్తం వలస వచ్చే వారు అధికంగా ఉన్నారు. ఇలా వచ్చే వారు పిల్లలతో సహా కొంతకాలం ఇక్కడే ఉండి ఆ తరువాత వెళుతుంటారు. ఇలా వచ్చిన వారంతా ఉదయం, సాయంత్రం బోధనతో పాటు భోజన సదుపాయం ఉంటుందని పిల్లలను సీజనల్ హాస్టల్‌కు పంపుతున్నారు. చదువుకోవాలన్న ఆసక్తి ఉన్నా ఇంట్లోని ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కొందరు పిల్లలు అర్ధాంతరంగా బడి మానేసి పనికి వెళుతున్నారు. ఇలాంటి వారు హాస్టల్‌కు ఉదయం, సాయంత్రం వేళ వచ్చి విద్యనభ్యసిస్తున్నారు. సర్కారు బడుల్లో చదివే నిరుపేద పిల్లలు పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం చేసి ఉదయం, రాత్రి హాస్టల్‌కు రావడం వల్ల అదనపు బోధనతోపాటు రెండు పూటలా భోజన వసతి కలుగుతుంది. వీటిని బాగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఏర్పాటు చేయడం వల్ల ఎక్కువ మంది చిన్నారులకు ఉపయుక్తంగా మారాయి.



కొడవలూరులోని ఎన్టీఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టల్

సేవా భావంతో నిర్వహణ



ఎన్టీఆర్ కాలనీలో సేవా భావంతో సీజనల్ హాస్టల్‌ను నిర్వహిస్తున్నాం. హాస్టల్‌లో 50 మందికి పైగా చిన్నారులు ఉన్నారు. కొడవలూరు ప్రాంతంలో ఎక్కువగా వలస పిల్లలు, డ్రాపౌట్స్ ఉన్నారు. వారిని గుర్తించి తల్లిదండ్రులు, పిల్లలకు అవగాహన కల్పించి సీజనల్ హాస్టల్‌కు వచ్చేలా చేశాం. ఎంఈడీ, బీఈడీ అర్హత కలిగిన ఇద్దరు ఉపాధ్యాయులను నియమించి విద్యాబోధన చేస్తున్నాం. రెండు పూటలా భోజన సదుపాయం కల్పిస్తున్నాం. హాస్టల్ నిర్వహణకు సొంత నిధులు వెచ్చిస్తే మూడు లేదా నాలుగు నెలలకోసారి ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది.
– పీ ప్రసన్న గణపతి, హాస్టల్ నిర్వాహకులు

హాస్టల్ ఉపయోగంగా ఉంది



నాకు ఇద్దరు ఆడ పిల్లలు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో 2,5 తరగతులు చదువుతున్నారు. వీరిని సీజనల్ హాస్టల్‌కు పంపడం వల్ల ఎంతో ఉపయోగంగా ఉంది. ఉపాధి పనులకు ఉదయం 6 గంటలకే వెళ్లాల్సి వస్తోంది. పనులకు వెళుతూ సీజనల్ హాస్టల్‌లో పిల్లలను వదిలేస్తే అక్కడే ఉదయం అల్పాహారం తీసుకుని ప్రత్యేక తరగతులకు హాజరై పాఠశాలకు వెళుతున్నారు.
– ఎస్కే.గౌసున్నీసా, ఎన్టీఆర్ గిరిజన కాలనీ, కొడవలూరు

విద్యలో మెరుగు పడుతున్నారు



నా కుమారుడు శేషయ్య స్థానిక ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. పాఠశాలతో పాటు సీజనల్ హాస్టల్‌కు పంపడం వల్ల విద్యలో బాగా మెరుగుపడుతున్నాడు. రెండు పూటలా సంతృప్తికరంగా భోజనం చేస్తున్నారు. బలవంతంగా పిల్లలను హాస్టల్, బడికి పంపాల్సిన పనిలేకుండా వారే వెళుతున్నారు.
– కట్టుపల్ల వెంకమ్మ, ఎన్టీఆర్ గిరిజన కాలనీ, కొడవలూరు

పేదలకు ఉపయుక్తం



సీజనల్ హాస్టళ్లు పేదలకు ఎంతో ఉపయుక్తం. హాస్టళ్లకు వచ్చే వారిలో అధికంగా డ్రాపౌట్స్, వలసవాసుల పిల్లలు ఉన్నారు. కూలీల పిల్లలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంది. పిల్లలను హాస్టల్‌కు పంపి నిశ్చింతగా పనులకు వెళుతున్నారు. ఉదయం, సాయంత్రం సైతం బోధన చేస్తుండడంతో విద్యాపరంగానూ మెరుగుపడుతున్నారు.
– జీ.వసంతకుమారి, ఎంఈఓ, కొడవలూరు

విద్యాదీవెనకు రూ.4.11కోట్లు విడుదల

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు, ముత్తుకూరు, మనుబోలు, వెంకటాచలం, టీపీగూడూరు మండలాల్లోని 5,308 మంది విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన పథకం కింద రూ.4.11 కోట్లు విడుదలయ్యాయి. రాష్ట్రంలోని విద్యార్థుల ఉన్నత చదువుల కోసం సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదివారం వారి ఖాతాల్లో నగదు జమచేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించిన జగనన్న విద్యాదీవెన వివరాలను వెల్లడించారు.

రైల్వేట్రాక్ పనులతో ప్రయాణికుల అవస్థ

వెంకటాచలం: వెంకటాచలం రైల్వేగేటు వద్ద రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో ప్రయాణికులు అవస్థ పడుతున్నారు. వెంకటాచలం–సర్వేపల్లి రోడ్డులోని వెంకటాచలం రైల్వేగేటు వద్ద రైల్వే ట్రాక్ నిర్మాణ పనులను ఈ నెల 14న ప్రారంభించారు. గేటును మూసేసిన రైల్వే అధికారులు మూడ్రోజుల్లో నిర్మాణ పనులను పూర్తి చేసి రాకపోకలను పునరుద్ధరిస్తామని వద్ద బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో సర్వేపల్లి రోడ్డు మార్గంలో వెళ్లే ప్రయాణికులు తిక్కవరప్పాడు మీదుగా రాకపోకలు కొనసాగిస్తున్నారు. అయితే ఆదివారం నాటికి కూడా పనులు పూర్తికాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉచిత వైద్యశిబిరం

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక సూర్యనందన్ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన హేమలతా రెడ్డి న్యూరో సెంటర్ వైద్యురాలు 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మూర్ఛ వ్యాధిపై అవగాహన కల్పించారు.

వైభవంగా పెద్దగూడెమ్మకు పొంగళ్లు



పెద్దగూడెమ్మ, పోతురాజు విగ్రహాల ఊరేగింపు



పొంగళ్లు పెట్టేందుకు తరలివచ్చిన మహిళలు

ముత్తుకూరు: మండలంలోని బ్రహ్మదేవిలో గ్రామదేవత నాగశక్తి స్వరూపిణి పెద్దగూడెమ్మ పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విశేషంగా అలంకరించారు. పెద్దగూడెమ్మ, పోతురాజు ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. భక్తులు చిందులు వేస్తూ అనుసరిస్తుండగా దారి పొడవునా మహిళలు తమ ఇళ్ల ముందు ముగ్గులు వేసి గ్రామదేవతలకు స్వాగతం పలికారు. పంచాయతీ పరిధిలోని మహిళలు సామూహికంగా ఆలయానికి చేరుకుని పొంగళ్లు పెట్టి పెద్దగూడెమ్మ, పోతురాజుకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట: పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఆశ్రమ కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, జైన, తదితర మతాలకు సంబంధించిన ప్రార్థనలు జరిపారు. తొలుత ఆశ్రమంలోని గాంధీజీ, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు మంజుల, సర్పంచ్ సుధాకర్, మేనేజర్ సాయిమనోజ్, తదితరులు పాల్గొన్నారు.



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

25న ఆసరా మూడో విడత చెల్లింపు

కొడవలూరు: స్వయం సహాయక సంఘాలకు ఆసరా మూడో విడత నగదును ప్రభుత్వం ఈ నెల 25న చెల్లించనుందని ఏపీఎం ఎస్ రుక్మిణి తెలిపారు. ఆసరా సంబరాల్లో భాగంగా కొడవలూరులో ఆదివారం సంఘ బంధం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం నాలుగు విడతల్లో రూ.21 కోట్లు చెల్లించనుందని తెలిపారు. ఇప్పటికే రూ.14 కోట్లు చెల్లించగా, మిగిలిన మొత్తాన్ని మూడు, నాలుగు విడతల్లో చెల్లించనుందని వివరించారు. ఆసరా మూడో విడతపై ఈ నెల 14 నుంచి ఆసరా సంబరాలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. 14 నుంచి 17వ తేదీ వరకు పొదుపు సభ్యుల ఇళ్లకు వెళ్లి మూడో విడతలో ప్రభుత్వం ఎంత నగదు చెల్లించనున్నదనే విషయాన్ని తెలియజేయడం జరిగిందన్నారు. 18 నుంచి 23వ తేదీ వరకు సంఘబంధాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి ఆసరాపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీసీ కే ఉదయ్‌కుమార్, సంఘబంధం అధ్యక్షులు పీ ప్రశాంతి, వీఓఏ నాగమణి, సంఘబంధ సభ్యులు పాల్గొన్నారు.



కొడవలూరు: ఆసరాపై సంఘ బంధంతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



పాస్టర్ స్వరాజ్‌ను సన్మానిస్తున్న వైఎస్‌ఎంపీపీ వేణుంబాక, తదితరులు

పొదలకూరు : రాష్ట్రంలోని క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్‌ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన తోడేరు పంచాయతీ శాంతినగర్‌కు చెందిన పాస్టర్ లక్కు స్వరాజ్‌కు ఆదివారం ఆత్మీయ సన్మానం నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సన్మాన కార్యక్రమానికి వైఎస్‌ఎంపీపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆశీస్సులతో మంచి మనిషి స్వరాజ్‌కు జిల్లాస్థాయి పదవి లభించడం సంతోషకరమన్నారు. క్రిస్టియన్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం సన్మాన గ్రహీత మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వహిస్తానని, మంత్రి కాకాణికి ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు పూకోటి లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, తోడేరు మాజీ సర్పంచ్ ఏనుగు శేఖర్‌రెడ్డి , విశ్రాంత ఉపాధ్యాయుడు కొప్పోలు జగన్నాథరావు, ఎంపీటీసీలు జీ.శ్రీనివాసులు, స్వర్ణ సుగుణ, సభాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కొప్పోలు చలపతిరావు, రవీంద్ర, లోకేష్, యజ్ఞాని, కే.వెంకటేశ్వర్లు, పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం..అపార నష్టం

పొదలకూరు : మండలంలోని అన్నదాతలను అకాల వర్షం అతలాకుతలం చేసింది. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరి, పత్తి పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారు. రబీలో 10,500 ఎకరాల్లో వరి, 1,500 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అకాల వర్షంతో కోత దశలోని 730 హెక్టార్ల(1,885 ఎకరాలు)లోని వరి పంట, 80 హెక్టార్ల(200 ఎకరాలు)లోని పత్తి పంట దెబ్బతిన్నట్లుగా ప్రాథమికంగా వ్యవసాయాధికారి ఏ వాసు అంచనావేశారు. ఆదివారం ఆర్బీకేల సిబ్బంది ద్వారా పంటలను పరిశీలించగా, బిరదవోలు, ఆర్‌వైపాలేం, మొగళ్లూరు, పొదలకూరు, తాటిపర్తి, చెన్నారెడ్డిపల్లి, ఇనుకుర్తి, దుగ్గుంట, తాటిపర్తి–2, మరుపూరు, తోడేరు, సూరాయపాళెం, నేదురుమల్లి, వావింటపర్తి, కనుపర్తి, ప్రభగిరిపట్నం, మహ్మదాపురం, విరువూరు, తదితర గ్రామాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్టు గుర్తించారు. కాగా ఉద్యాన పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని ఉద్యాన శాఖాధికారి ఆనంద్ వెల్లడించారు.

తడిసిన ధాన్యం

మండలంలో ముందుగా నాట్లు వేసిన 10 శాతం మంది రైతులు కోతలు చేపట్టారు. కొందరు ముందుగా కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని గిట్టుబాటు ధరలకు అమ్ముకున్నారు. మరికొందరు ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబోసుకుని ఇళ్లకు చేర్చుకునే పనిలో ఉన్నారు. ఈ క్రమంలో అకాల వర్షంతో ధాన్యం తడిసిపోవడంతో రంగు మారితే కొనుగోలు చేయరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు.

వెంకటాచలం: మండలంలోని గత మూడ్రోజులుగా కురుస్తున్న వర్షం ఆదివారం లేపోవడంతో రైతులకు కాస్త ఉపశమనం లభించింది. గొలగమూడి, కంటేపల్లి, కనుపూరు, కందలపాడు, కురిచెర్లపాడు, కసుమూరు, తదితర గ్రామాల్లో వరికోతలు వారం రోజుల క్రితమే ప్రారంభమవగా, సర్వేపల్లి రిజర్వాయర్ ఆయకట్టు కింద ఏప్రిల్ మొదటి వారంలో వరికోతలు ప్రారంభం కానున్నాయి. మూడ్రోజుల పాటు కురిసిన వర్షంతో వరికోతలు జరుగుతున్న గ్రామాల్లోని రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. కోసిన ధాన్యం తడిచిపోతుందనే భయంతో వరికోతలకు బ్రేక్ వేశారు. ఆదివారం వర్షం కురవకపోవడంతో రైతులు కాస్త ఊపిరిపీల్చుకున్నారు.

తోటపల్లిగూడూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మండలంలో మూడ్రోజులుగా వర్షం కురుస్తోంది. ఆదివారం కూడా ఓ మోస్తరు వర్షం కురవడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. మండలంలో రబీ పంట కోత దశలో ఉంది. కొన్ని ప్రాంతాల్లో వరికోతలు మొదలైన వర్షంతో నిలిపివేశారు. అకాల వర్షంతో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు వర్షాన్ని బూచిగా చూపి దళారులు ప్రస్తుతం ఉన్న ధాన్యం ధరలను తగ్గించేస్తున్నారు. దీంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

మనుబోలు: మండలంలో శని, ఆదివారాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. వరి కోతల సమయం కావడంతో అన్నదాతల్లో గుబులు నెలకొంది. మండలంలో రబీ సీజన్‌లో 20 వేలకు పైగా ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ధాన్యం ధరలు బాగా ఉండడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. ఇప్పటికే 30 శాతం మంది రైతులు వరి కోతలు పూర్తి చేయగా, మిగిలిన వారు కోతలు చేపట్టాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అకాల వర్షం పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోత దశలోని వరిపైరు నేలవాలితే గింజలు రాలిపోయి దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉంది. దీనికితోడు ఇదే అదనుగా ధాన్యం రంగు మారిందని దళారులు ధరలు తగ్గించే అవకాశం ఉంది. వరికోత మెషిన్ల అద్దెలు భారీగా పెరుగుతాయి. అన్నీ వెరసి నష్టాలు మిగిల్చే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కాగా వరికోతలు పూర్తి చేసి కళ్లాల్లో ధాన్యం ఆరబోసుకున్న రైతులు పట్టలతో కప్పేందుకు ఇబ్బందులు పడ్డారు.



విడవలూరు: నేలవాలిన వరిపైరును కట్టలు కట్టిస్తున్న రైతులు

ఆశలు ఆవిరి

కొడవలూరు: అకాల వర్షంతో అన్నదాతల ఆశలు ఆవిరయ్యాయి. మండలంలో ఆర్‌ఎన్‌ఆర్ 15048(షుగర్ లెస్) రకాన్ని రైతులు ఎక్కువగా సాగు చేశారు. ఈ రకం వరిపైరు ఏపుగా పెరిగింది. ఎకరాకు నాలుగు పుట్ల మేర దిగుబడి వచ్చేలా పంట బాగా పెరిగింది. మార్కెట్లో ఈ రకం ధర బాగుంది. పుట్టి రూ.19,500 వరకు పలుకుతుండడంతో రైతులు బాగా లాభాలు వస్తాయని ఆశలు పెంచుకున్నారు. అయితే వరుణుడు రైతులపై కన్నెర చేశాడు. మండలంలో శనివారం సాయంత్రం 20 నిమిషాల పాటు వర్షంతో కూడిన గాలులు వీచాయి. దీంతో ఏపుగా పెరిగిన షుగర్ లెస్ వరి పైరు నేలకొరిగింది. గుండాలమ్మపాళెం, బసవాయపాళెం, నాయుడుపాళెం , తదితర గ్రామాల్లో సుమారు 500 ఎకరాల్లోని వరిపంట నేలకొరిగింది. బీపీటీ 5204, కేఎన్‌ఎం 1638 రకాలను కొందరు రైతులు సాగు చేసినప్పటికీ ఈ రకాలు ఎత్తు తక్కువ పెరగడం వల్ల అక్కడక్కడా మాత్రమే స్వల్పంగా నేలకొరిగాయి. షుగర్‌లెస్ సాగు చేసిన రైతుల ఆశలు మాత్రం అకాల వర్షంతో అడియాశలయ్యాయి. నేలకొరిగిన పంటలో ఎక్కువ శాతం ఇప్పటికీ లేత దశలోనే ఉంది. ఇలాంటి రైతులు బాగా నష్టపోనున్నారు. పక్వానికి వచ్చిన పంట నేలకొరిగిన రైతులు మాత్రం స్వల్పంగా నష్టపోనున్నారు.

అకాల వర్షంతో రైతులు ఇబ్బందులు

కోవూరు: గత రెండు రోజులుగా కురిసిన అకాల వర్షంతో కోవూరు మండలంలో దాదాపు 150 ఎకరాల్లోని వరిపంట నేలవాలింది. దీంతో ధాన్యం రాలిపోయి పంట దిగుబడులు తగ్గుతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

విడవలూరు: అకాల వర్షం మండలంలోని వరి, వేరుశనగ పంటలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. దాదాపు 450 ఎకరాల్లోని వరిపంట నేలవాలింది. సుమారు 50 ఎకరాల్లోని వేరుశనగ పంట దెబ్బన్నట్లు వ్యవసాయాధికారుల ప్రాథమిక అంచనా.



కోవూరులో నేలకొరిగిన వరిపంట



కొడవలూరు: గుండాలమ్మపాళెంలో నేలకొరిగిన లేత దశలోని షుగర్‌లెస్ పంట



మనుబోలు: వీరంపల్లిలో పడిపోయిన వరి పంట



టీపీగూడూరు: ఈదూరు సమీపంలో నేలవాలిన వరిపంట



పొదలకూరు: మరుపూరులో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



పొదలకూరు: నేలవాలిన వరిపంటను చూపుతున్న రైతు



మనుబోలు: ధాన్యాన్ని పట్టలతో కప్పి పెడుతున్న రైతులు